క్లుప్తంగా

అనాథ యువతి పెళ్లికి చేయూత



ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న అధికారి

లింగాపూర్: మండల కేంద్రానికి చెందిన తల్లిదండ్రులు లేని ఆడబిడ్డ జాదవ్ స్వాతి పెళ్లికి కొత్తపల్లి అటవీ సెక్షన్ అధికారి మహేశ్ పేపర్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఆమె బంధువు దవీత్ కుమార్‌కు రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్ చేతులమీదుగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి అనూష, తదితరులు పాల్గొన్నారు.

'బోజ్జిరావు సేవలు మరువలేనివి'



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న గ్రామస్తులు

తిర్యాణి: గుండాల గ్రామ ప్రజల ఆకలి తీర్చిన సోయం బోజ్జిరావు సేవలు మరువలేనివని గ్రామస్తులు పేర్కొన్నారు. శనివారం బోజ్జిరావు 28వ వర్ధంతి సందర్భంగా గుండాల గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ గుండాల గ్రామంలో ఉన్న రాతి నేలపై సేంద్రియ పద్ధతులు సాగు చేయడం నేర్పించి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారన్నారు. బోజ్జిరావు కుమారుడు సురేశ్, మాజీ ఎంపీటీసీ కోవ మోతిరాం, గ్రామస్తులు మర్సుకోల అశోక్, రాహుల్, భీంరావు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న సీఆర్‌పీలు

కెరమెరి: మహిళలు ఆర్థికంగా ఎదగాలని సీఆర్‌పీలు ప్రీతి, క్రిష్ణవేణి అన్నారు. శనివారం మండలంలోని భీమన్‌గొంది గ్రామంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులతో వారు మాట్లాడారు. సంఘంలో పొదుపు అధికంగా చేయాలని, ఆపదలో ఉన్న వారికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. 13 –15 గుంటల స్థలంలో వెదురు మొక్కలు నాటాలని, ప్రతి మహిళా రైతుకు 60 మొక్కలతో పాటు సేంద్రియ ఎరువులు ఉచితంగా అందిస్తామన్నారు. వీవో సభ్యులు, సీసీ, వీవోఏలు మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీసీ సత్య, వీవోఏ ఇందిరా తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

తిర్యాణి: మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎంపీడీవో వేముల మల్లేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు సార రమేశ్ గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న చేతిపంపులు మరమ్మతులు చేయకపోవడం వల్ల తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పులి వెంకటేశ్, సీతారాం, తిరుపతి, అరుణ్ తదితరులు ఉన్నారు.

'సంవిధాన్ బచావో' విజయవంతం చేయాలి

చింతలమానెపల్లి: జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌లో ఆదివారం నిర్వహించే సంవిధాన్ బచావో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ సుల్కరి ఉమామహేశ్ అన్నారు. ఆసిఫాబాద్‌లోని ప్రేమల గార్డెన్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్టేట్ లైబ్రరీ చైర్మన్, ప్రొఫెసర్ ఎండీ రియాజ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నర్సయ్య హాజరవుతున్నారని పేర్కొన్నారు. మండలంలోని కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు, యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

పోగొట్టుకున్న బ్యాగు అందజేత

ఆసిఫాబాద్: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ బస్సులో మర్చిపోయిన బ్యాగును సదరు మహిళకు శనివారం ఆర్టీసీ అధికారులు అందజేశారు. బెల్లంపల్లి –మంచిర్యాల మార్గంలో ప్రయాణించిన ఓ మహిళ బస్సులో బ్యాగు మరచిపోగా గమనించిన కండక్టర్ కవిత ప్రయాణికురాలి కుమారుడికి బ్యాగును అప్పగించారు. నిజాయతీ చాటుకున్న కండక్టర్‌ను డీఎం రాజశేఖర్ అభినందించారు.

ఆశల పల్లకిలో నిరుద్యోగులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడు మొహర్లే దేవేందర్. మండల కేంద్రంలోని హనుమాన్‌వాడకు చెందిన వ్యక్తి. ఆన్‌లైన్ సెంటర్ కోసం రాజీవ్ యువ వికాసంలో దరఖాస్తు చేసుకున్నాడు. ప్రస్తుతం ఒక కంప్యూటర్, జిరాక్స్ మిషన్‌తో చిరు ఆదాయం పొందుతున్నాడు. కానీ ఆదాయం ఎటూ సరిపోక వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇలా అనేక మంది నిరుద్యోగులు, యువత వివిధ యూనిట్ల కోసం రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా దరఖాస్తులు చేసుకున్నారు. రుణాలు మంజూరవుతాయని, సొంతంగా ఉపాధి లభిస్తుందని ఆశ పడుతున్నారు.

- వరంలా రాజీవ్ యువ వికాసం!
- మండలంలో 1760 దరఖాస్తులు
- జూన్ 2న అందించనున్న మంజూరు పత్రం



ఎంపీడీవోకు దరఖాస్తు అందజేస్తున్న నిరుద్యోగి

కెరమెరి: యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరిట కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. వివిధ స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించి ఆర్థికంగా బలోపేతం కావడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు అందించనుంది. ఈ పథకానికి భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 14తో గడువు ముగిసింది. మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉండగా 1760 దరఖాస్తులు అందాయి. అందులో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం 203 మంది దరఖాస్తులు చేసుకోగా, ఎస్టీ కార్పొరేషన్ 708, బీసీ కార్పొరేషన్ 630, మైనార్టీ కార్పొరేషన్‌కు చెందిన దరఖాస్తులు 219 అందాయి.

జూన్ 2న అర్హుల జాబితా..

గడిచిన కొంత కాలంగా నిరుద్యోగులు, యువత రుణాలు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పేరిటా రుణాలు అందించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో యూనిట్ల వారీగా జాబితాను విడుదల చేసింది. వీటి కోసం ఈనెల 14 వరకు వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయగా, సంబంధిత దరఖాస్తుదారులు హార్డ్ కాపీలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేశారు. వచ్చిన దరఖాస్తులను మే 1 నుంచి అధికారులు పరిశీలించనున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు జాబితా అందజేస్తారు. అర్హులైన వారికి జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రుణ మంజూరు పత్రం అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

మే 15లోపు పరిశీలిస్తాం..



అభ్యర్థుల నుంచి రాజీవ్ యువ వికాసం రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను మే15 వరకు పరిశీలిస్తాం. అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తాం. అర్హులైన వారికి జూన్ 2న నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు మంజూరు పత్రాలు అందజేస్తాం.

– అంజద్‌పాషా, ఎంపీడీవో

'ఉపాధి' కల్పించండి



ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆదివాసీలు

కెరమెరి: ఉపాధిహామీ పని కల్పించాలని మండలంలోని కెస్లాగూడ ఆదివాసీలు ఎంపీడీవో అంజద్‌పాషాను కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ మడావిగూడ, చిన్నుగూడ గ్రామ కూలీలు పనులు చేయనప్పటికీ చేసినట్లుగా డబ్బులు వస్తున్నాయని, తమకు పనులు కల్పించాలని వేడుకున్నప్పటికీ పనులు కల్పించడం లేదన్నారు. వెంటనే పనులు కల్పించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎంపీడీవో టీఏను పిలిపించి సమస్య పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. జంగు, దేవ్‌రావు, మారుతి తదితరులు ఉన్నారు.

ఆలయ భూములను పరిరక్షించాలి



మాట్లాడుతున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీకేశవనాథస్వామి ఆలయ భూములను పరిరక్షించాలని, ఆలయాభివృద్ధికి దేవాదాయశాఖ సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ శ్రీకేశవనాథస్వామి ఆలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. ఆలయానికి 89 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, ఇందులోని 83 సర్వే నంబర్‌లోగల 8.22 ఎకరాల భూమిలో కొందరు తాత్కాలిక నివాసాలు నిర్మించుకుని ఉంటున్నట్లు తెలిపారు. గతంలో రెవెన్యూ పరిధిలో ఉన్న సమయంలో తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్నవారు ఆలయానికి నిర్ణీత అద్దె చెల్లించాలని ఒప్పందం చేసుకున్నప్పటికీ నేటి వరకు పైసా చెల్లించలేదని ఆరోపించారు. ఎండోమెంట్ అధికారులు ఇప్పటికైనా పూర్తిస్థాయిలో సర్వే చేయించి ఆలయ భూములను కాపాడాలని కోరారు. సంవత్సరానికి భూములు వేలం వేస్తే వచ్చే సుమారు రూ.17 లక్షల ఆదాయంతో ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కూడా దేవాదాయశాఖపై ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆలయానికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వైరాగడె మనోజ్‌కుమార్, నిమ్మకంటి సుగుణాకర్, వెంకట్ రవీందర్, మాసాదె రాజేశ్వర్, అర్చకుడు ఒజ్జల నరేశ్‌శర్మ పాల్గొన్నారు.

రోడ్డు పనులు అడ్డుకున్న అధికారులు

- వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు



అటవీ అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

చింతలమానెపల్లి: మండలంలోని బూరెపల్లిలో గ్రామస్తులకు అటవీ అధికారులకు మధ్య శనివారం వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామంలోని ప్రధాన రహదారిపై సీసీ రోడ్డు పనులు నిర్వహిస్తుండగా ఖర్జెల్లి డిప్యూటీ రేంజ్ అధికారి హైమావతి ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. గ్రామం అటవీ ప్రాంతం పరిధిలో ఉన్నందున పనులు నిర్వహించవద్దని తెలిపారు. దీంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంజేశారు. గతంలో రణవెల్లి నుంచి కోర్సిని వరకు గ్రామం మీదుగా బీటీ రోడ్డు ఉండేదని, దీనికి మరమ్మతులు నిర్వహించి కొత్త రహదారి నిర్మిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ప్రజలకు అవసరమైన రహదారి పనులు అడ్డుకోవడం సరికాదని గ్రామస్తులు పేర్కొన్నారు. అటవీ అధికారులు దురుద్దేశంతో పనులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పనులు నిలిపివేయడంతో అటవీ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న వెంకటి

కెరమెరి: గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఇబ్బందులను తొలగించి నీటి సౌకర్యం కల్పించాలని మండల ప్రత్యేకాధికారి, ఏపీడీ వెంకటి అన్నారు. శనివారం ఆయన మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ఎంపీడీవో సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీపీల్లో ఉన్న కార్యదర్శులకు తాగునీటి వనరులపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. భూగర్భజలం ఇంకిపోయిన బావుల్లో పూడికతీసి నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల గుర్తింపులో అర్హులకు న్యాయం జరిగే విధంగా కమిటీ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్ పాషా, ఎంపీవో యుగేందర్ తదితరులు ఉన్నారు.

ప్రజలు పోలీసులకు సహకరించాలి



ఎస్సైని సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కెరమెరి: ప్రజాసమస్యల పరిరక్షణలో పోలీసులకు సహకారమందించాలని ఎస్సై మధుకర్ అన్నారు. శనివారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఆయన్ను కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం మండల పరిస్థితులపై ఎస్సై అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు, నాయకులు ఆత్రం లక్ష్మణ్, లింబారావు, న్యానేశ్వర్, జలపతి, సుందర్, నగేశ్, కుత్‌బోద్దీన్, తిరుపతి, సుదర్శన్, బాబు, బాబుసింగ్, హన్మంతు, బుచ్చయ్య, వెంకటస్వామి, తిరుపతి, గిడ్డప్ప తదితరులు ఉన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేశ్



జాబితా పరిశీలిస్తున్న ఎంపీడీవో అంజద్‌పాషా

కౌటాల: నాణ్యత ప్రమాణాలు పాటించి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. శనివారం మండలంలోని నాగేపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణ పనుల ఫొటోలను యాప్‌తో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సక్రమంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, ప్రభుత్వం ఇంటి నిర్మాణ నగదు అందిస్తుందని తెలిపారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని, పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఏపీవో పూర్ణిమ, ఈసీ సంతోష్, కార్యదర్శులు సాయికృష్ణ, సంధ్య, కవిత తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితా పరిశీలన

కెరమెరి: మోడి, బాబేఝరి గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల జాబితాను శనివారం ఎంపీడీవో అంజద్‌పాషా పరిశీలించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలన్నారు. వితంతవులు, దివ్యాంగులు, ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా చూడాలని పేర్కొన్నారు.

'కార్యకర్తలకు అండగా ఉంటాం'



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పార్టీని బలోపేతం చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో పార్టీ కార్యకర్తల జిల్లా సమావేశం ఉందన్నారు. నేడు జిల్లాలోని పార్టీ కార్యకర్తలు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని తెలిపారు. సమావేశంలో చింతలమానెపల్లి పార్టీ మండల కన్వీనర్ ఉమా మహేశ్, నాయకులు భాస్కర్, నాహీం, గట్టయ్య, పోశం తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో కలెక్టర్ పూజలు



కలెక్టర్ కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తన కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కలెక్టర్ దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. కమిటీ సభ్యులు గుండా వెంకన్న, ధర్మపురి వెంకటేశ్వర్లు, గోపాల్‌నాయక్, ఎకిరాల శ్రీనివాస్, గడ్డల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ భుజంగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అంబలి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ డైరెక్టర్ ధర్మపురి వెంకటేశ్వర్లు, సభ్యులు శంకర్, హష్మీ, అబ్దుల్లా పాల్గొన్నారు.

క్రీడాశిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జీఎం విజయ భాస్కర్ రెడ్డి

రెబ్బెన: సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి కాల ఉచిత క్రీడాశిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో శనివారం వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేసుకోకుండా క్రీడలపై దృష్టి సారించాలన్నారు. 25 రోజుల పాటు ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్ శిక్షణ శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఇన్‌చార్జి పీవో శంకర్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

దహెగాం: పోక్సో కేసులో అరెస్టయిన మండలంలోని పెసరిగుంట గ్రామానికి చెందిన కామెర హోక్షుకు ఆసిఫాబాద్ జిల్లా జడ్జి 13 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై కందూరి రాజు శనివారం తెలిపారు. హోక్షు పెసరిగుంట గ్రామానికి చెందిన 11 ఏళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించినందుకు ఈ నెల 23న పోక్సో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

మైనార్టీ గురుకుల విద్యార్థులకు సన్మానం



సన్మానిస్తున్న అబ్దుల్ నదీమ్

ఆసిఫాబాద్‌రూరల్: ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి అబ్దుల్ నదీమ్ అన్నారు. శనివారం జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో ఇటీవల మైనార్టీ గురుకులంలో ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి విద్యార్థులను అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు ఉన్నత లక్ష్యంతో చదివి మంచి ప్రయోజకులు కావాలని సూచించారు. 2025 –26 విద్యా సంవత్సరంలో 100శాతం ప్రవేశాలు జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫిరోజ్, పుష్పలత, విద్యార్థులు పాల్గొన్నారు.

15లోపు వేతనాలు చెల్లించేందుకు అంగీకారం



కోల్ ట్రాన్స్‌పోర్టు యాజమాన్యంతో చర్చలు జరుపుతున్న కార్మిక సంఘం నాయకులు

రెబ్బెన: ఏరియాలోని గోలేటిలో పని చేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు ప్రతీనెల 15వ తేదీలోగా వేతనాలు చెల్లించేందుకు కోల్ ట్రాన్స్‌పోర్టు యాజమాన్యం అంగీకరించినట్లు ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ అన్నారు. సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ట్రాన్స్‌పోర్టు లారీ డ్రైవర్లు, క్లీనర్లు విధులు బహిష్కరించి తెలుపుతున్న నిరసన కార్యక్రమం శనివారం కొనసాగించారు. దిగివచ్చిన కోల్ ట్రాన్స్‌పోర్టు యాజమాన్యం కార్మిక సంఘం నాయకులతో చర్చలు జరపగా చర్చలు సఫలమైనట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ప్రతీనెల 15వ తేదీలోగా వేతనాలు చెల్లించడంతో పాటు డ్రైవర్లకు 15 మస్టర్లకు రూ. 20వేలు, క్లీనర్లకు రూ. 10వేలు చెల్లించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించేందుకు అంగీకరించినట్లు తెలిపారు. అనంతరం సమ్మెను విరమించినట్లు కార్మిక సంఘం నాయకులు ప్రకటించారు. చర్చల్లో ఏఐటీయూసీ నాయకులు స్వామి, లచ్చన్న, తిరుపతి, సంతోష్, ట్రాన్స్‌పోర్ట్ సంస్థ ప్రతినిధి ప్రవీణ్‌రావు, ఎస్‌వోటూజీఎం రాజమల్లు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన దుప్పి

కౌటాల: మండల కేంద్రంలోని మినీ స్టేడియం సమీపంలో శనివారం వీధి కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందినట్లు ఎఫ్ఎస్‌వో తులసీరాం నాయక్ తెలిపారు. ఆయన ప్రకారం.. ఉదయం మినీ స్టేడియం సమీపంలోని నీలగిరి ప్లాంటేషన్ వద్ద చుక్కల దుప్పిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయాలయ్యాయని తెలిపారు. వెంటనే అటవీ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించగా గాయాలతో ఉన్న దుప్పిని పశువైద్యశాలకు తరలించే క్రమంలో మృతి చెందిందన్నారు. చుక్కల దుప్పిని ఖననం చేసినట్లు పేర్కొన్నారు.

నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలి



భూమిపూజ చేస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన: జీఎం కార్యాలయ ఆవరణలో చేపడుతున్న పలు నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం జీఎం కార్యాలయ ఆవరణలో నూతన వేదికతో పాటు రికార్డు గది నిర్మాణాలకు జీఎం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జీఎం కార్యాలయ ఆవరణలో వేడుకలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు సరైన వేదిక లేకపోవడంతో ఇబ్బందులకు గురైనట్లు తెలిపారు. దీంతో నూతన వేదిక నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఏరియాకు సంబంధించిన రికార్డులు భద్రంగా ఉండేలా రికార్డు గది నిర్మాణం సైతం చేపట్టినట్లు తెలిపారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, సీఎంవోఏఐ ఉపాధ్యక్షుడు రమేశ్, డీజీఎం సివిల్ ఎస్‌కే మదీనాబాషా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.